సాక్షి
చిత్తూరు
సోమవారం । 11 । డిసెంబర్ । 2023



దుమ్మురేపిన ఎడ్లపందేలు

సంక్రాంతిని పురస్కరించుకుని ముందస్తుగా ఎస్సార్ పురంలోఆదివారం నిర్వహించిన ఎడ్లపందేలు దుమ్మురేపాయి. - 8లో



విద్యార్థుల ఉన్నతికి స్పెల్ బీ

విద్యార్థులు గణితంలో పట్టు సాధించి ఉన్నత స్థాయికి ఎదిగేందుకు సాక్షి మ్యాథ్స్ బీ.. స్పెల్ బీ పోటీలు నిర్వహించింది. - 8లో



కిక్కిరిసిన బోయకొండ

జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గంగమ్మ దర్శనానికి భక్తులు తరలిరావడంతో బోయకొండ కిక్కిరిసిపోయింది. - 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి మిషన్ ఇంద్రధనస్సు

చిత్తూరు రూరల్ : మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమాన్ని ఈనెల 11 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ రవిరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా వైద్య సిబ్బంది తమ పరిధిలో వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోని వారికి, మధ్యలో ఆపేసిన గర్భిణులు, పిల్లలకు టీకాలు వేయనున్నట్లు చెప్పారు. ఇందుకు గాను జిల్లాలో 488 మంది గర్భిణులు, ఏడాదిలోపు పిల్లలు 1,236 మంది, 1–5 ఏళ్ల లోపు పిల్లలను 991 మందిని గుర్తించామన్నారు. ఈ అవకాశాన్ని పిల్లల తల్లిదండ్రులు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వరసిద్ధుని దర్శనానికి 6 గంటలు



భక్తులతో నిండిపోయిన క్యూలు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. గత వారం రోజులుగా అయ్యప్పమాల ధారణ భక్తులు, సామాన్య భక్తులు స్వామివారి దర్శనానికి తరలి రావడంతో దర్శించుకోవడానికి 6 గంటల సమయం పడుతోంది. శని, ఆదివారాలు సెలవులు కావడంతో భక్తుల రద్దీ పెరగడంతో స్వామివారి కంపార్ట్‌మెంట్‌లు, రూ.150, రూ.100, ఉచిత క్యూలు, భక్తులతో నిండిపోయి ఆలయం వెలుపల వరకు బారులు తీరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు అధికారులు తగు ఏర్పాట్లు చేసి భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. వికలాంగులకు, వృద్ధులకు, చంటి పిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేక క్యూల ద్వారా స్వామివారి దర్శనం కల్పించారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అందజేసి పరిష్కరించుకోవాలన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే స్పందనకు అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. గైర్హాజరైతే శాఖాపరంగా కఠిన చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు.

ఇన్‌చార్జి కలెక్టర్‌గా శ్రీనివాసులు



చిత్తూరు కలెక్టరేట్ : రెండు రోజుల పాటు ఇన్‌చార్జి కలెక్టర్‌గా జేసీ శ్రీనివాసులు వ్యవహరించనున్నారు. ఎన్నికలకు సంబంధించి ఈ నెల 11, 12 తేదీల్లో న్యూఢిల్లీలో నిర్వహించనున్న సర్టిఫికేషన్ కార్యక్రమానికి కలెక్టర్ షణ్మోహన్ ఆదివారం బయలుదేరి వెళ్లారు. దీంతో రెండు రోజులపాటు ఇన్‌చార్జి కలెక్టర్‌గా జేసీ శ్రీనివాసులు విధులు నిర్వర్తించనున్నారు. కలెక్టర్ షణ్మోహన్ ఈ నెల 13న జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంటారు.

ఆరోగ్య సిరి

రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి ఆయుష్షు పోస్తోంది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీతో వెలుగునింపుతోంది. కార్పొరేట్ స్థాయిలో ఉచితంగా వైద్యం అందిస్తోంది. చికిత్స ఖర్చు రూ.వెయ్యి దాటితే ఆరోగ్య భాగ్యం కల్పిస్తోంది. ఆరోగ్య శ్రీ వ్యయ పరిమితి ప్రస్తుతం రూ.5 లక్షల వరకు ఉండగా ఇప్పుడు ఆపై వ్యయ భారాన్ని ప్రభుత్వమే భరించనుంది. ఈ మేరకు పరిమితిని రూ.25 లక్షల వరకు పెంచుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 18వ తేదీ నుంచి వ్యయ పరిమితి పెంపు అమలు చేసేందుకు సిద్ధమయ్యారు. దీంతో పేదలకు ఆరోగ్య శ్రీ మరింత రక్షగా నిలవనుంది.

- వైద్య వ్యయం రూ.1000 దాటితే ఆరోగ్యశ్రీతో చికిత్స
- వ్యయ పరిమితి రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంపు
- ఈ నెల 18 నుంచి అమలుకు శ్రీకారం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏటా సుమారు 80 వేల మందికి లబ్ధి



చిత్తూరు రూరల్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12 లక్షల కుటుంబాల వరకు వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కార్డులున్నాయి. వీరికి 56 ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల ద్వారా చికిత్స అందుతోంది ఈ ఆస్పత్రుల్లో. ఏటా 80 వేల నుంచి లక్ష మంది వరకు ఆరోగ్యశ్రీతో వైద్య సేవలను పొందుతున్నారు. ఇందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం రూ.62 కోట్ల వరకు వ్యయం చేస్తోంది. ఆసరా కింద రూ.18 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు బాధితులకు బ్యాంకు ఖాతాకు జమ చేస్తోంది. వీటితో పాటు జబ్బుల సంఖ్యను పెంచుతూ ప్రస్తుతం 3,257 వ్యాధులకు చికిత్స అందేలా ప్రభుత్వం పేదలకు ఊపిరిపోస్తోంది.

గత టీడీపీ పాలనలో...

గత టీడీపీ పాలనలో ప్రభుత్వ వైద్యం కంటే నాటు వైద్యమే నయం అనే దుస్థితి ఏర్పడింది. ఆస్పత్రిలో సరిపడినంత సిబ్బంది ఉండరు. సమయపాలన, నిర్వహణ లోప సమస్యలతో ప్రభుత్వ వైద్యం పేదలను ఆమడదూరంలో నిలబెట్టింది. జనం నొప్పులు భరించలేక ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు పెట్టేవాళ్లు. ఇలా ప్రాథమిక స్థాయి నుంచి జిల్లా స్థాయి ఆస్పత్రి వరకు సేవలు అరకొరగా అందేవి. మందు బిల్లలు మింగుడుపడేవి కావు. ఈ



ఆరోగ్య శ్రీ ద్వారా చికిత్స చేయించుకున్న వ్యక్తిని పలకరిస్తున్న ఆరోగ్య శ్రీ అధికారులు

కారణంగా పేదలకు వైద్య కష్టాలు భారంగా మారాయి. ఆరోగ్య శ్రీ సేవలను అంతంత మాత్రంగానే అందించారు. కేవలం 950 అనారోగ్య సమస్యలకు మాత్రమే అరకొర సేవలు చేసి చేతులు దులుపుకున్నారు.

వైఎస్సార్‌సీపీ రాగానే...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలులోకి వచ్చాక వైద్య సేవల్లో వేగం పెరిగింది. పల్లెల్లోనే వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు పురుడుపోసుకున్నాయి. ఫ్యామిలీ ఫిజీషియన్‌తో పల్లెలోనే సేవలు అందించేలా చర్యలు చేపట్టింది. తలుపుతట్టి గడపవద్దే వైద్య సేవలు అందిస్తోంది. నడవలేని స్థితిలో ఉంటే డాక్టరే ఇంటి వద్దకు వెళ్లి బాగోగులు చూస్తున్నారు. ఆస్పత్రుల్లో పోస్టుల భర్తీ ప్రక్రియను వెను వెంటనే పూర్తిచేస్తోంది. కావాల్సినన్ని మందులు, మాత్రలను అందుబాటులో ఉంచుతోంది. పీహెచ్‌సీలు కూడా 24 గంటలు పనిచేసేలా మార్గదర్శకాలు జారీ చేసింది. నాడు–నేడు అభివృద్ధితోపాటు అన్ని రకాల పరీక్షలు పీహెచ్‌సీలో చేస్తూ మెరుగైన చికిత్స చేస్తున్నారు. ఇక జగనన్న ఆరోగ్య సురక్షతో గ్రామాల్లోనే వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి చికిత్స అందిస్తోంది. మందులు, మాత్రలు ఉచితంగా పంపిణీ చేస్తోంది. రెండో విడతగా క్యాంపు నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ క్యాంపు ద్వారా మరింత మందికి పలు రకాల వ్యాధులు బయట పడడంతోపాటు ఖరీదైన వైద్యానికి ఆరోగ్య శ్రీ ద్వారా చికిత్స అందేలా చూస్తోంది.

కొత్త కార్డులు

ఆరోగ్య శ్రీ సేవలను సులభతరంగా పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతన కార్డులను అందించనుంది. ఈ కార్డులను కూడా ఈ నెల 19 నుంచి లబ్ధిదారులను అందించనున్నారు. చిత్తూరు జిల్లాలో 4,92,963, తిరు పతి జిల్లాలో 5,85,897 కార్డులు ఇచ్చే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. దీంతో పాటు ఆరోగ్యశ్రీ సేవలపై మరింత అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీనికి సంబంధించి జిల్లా యంత్రాంగానికి మార్గదర్శకాలు జారీ అయ్యాయి.

ఆరోగ్య అభయం

జీవన శైలిలోని మార్పుల వల్లనో, కరోనా శాపమో తెలియదు కానీ పలు రోగాలు జనాన్ని చుట్టిముట్టేస్తున్నాయి. వైద్యంతో నయం కానీ వారికి ఆపరేషన్ శరణ్యంగా మారుతోంది. ఇందుకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ. లక్షల్లో వ్యయమవుతోంది. ఈ భారం భరించలేని పేదలకు ప్రభుత్వం తీపి కబురందించింది. అలాంటి వారికి వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ఊపిరి పోస్తూ కొండంత అండగా నిలుస్తోంది. పేదలపై వ్యయ భారం ఉండకూడదని ప్రస్తుత పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ నెల 18న పరిమితి పెంపును సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

చిత్తూరు జిల్లా ఆరోగ్యశ్రీ సర్జరీ వివరాలు

సంవత్సరం	వైద్యం పొందినవారు	వ్యయం (రూ.కోట్లలో)
2019–20	43,898	96.29
2020–21	51,173	99.71
2021–22	75,941	13.48
2022–23	83,816	18.015
2023–24	63,691	12.43
మొత్తం	3,18,519	239.925

ఆరోగ్య ఆసరా వివరాలు

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	జమ (రూ.కోట్లలో)
2019–20	6,310	3.62
2020–21	17,286	90.01
2021–22	30,285	13.99
2022–23	43,065	20.01
2023–24	27,816	13.25
మొత్తం	1,24,762	140.88

పేదలకు మేలు..



ఇప్పుడున్న పరిస్థితుల్లో మాలాంటి వాళ్లు చిన్న ప్రైవేటు ఆస్పత్రులకు కెళ్లి వైద్యం చేయించుకోవాలంటే వేలు, లక్షల్లో ఖర్చవుతోంది. జ్వరమని ప్రైవేటు ఆస్పత్రికి వెళితే రూ.1000 చేతిలో ఉండాలి. అదే కొంచెం పెద్ద వ్యాధి అయితే తట్టుకుని నిలబడలేం. అప్పటికప్పుడు అప్పోసప్పో చేయాలంటే కూడా రూ.2 లక్షలు దొరకడం కష్టం. అలాంటిది మాలాంటి పేదలకు రూ. 25 లక్షల వరకు వైద్యం చేయిస్తారంటే అది గొప్ప నిర్ణయం.

– ధనమ్మ, వేనూతనపల్లి, పూతలపట్టు

వైఎస్సార్‌తోనే ఆయుష్



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పుణ్యమా అని ఆరోగ్యశ్రీ తీసుకొచ్చారు. అప్పట్లో ఎంతో మందికి ఈ పథకం ప్రాణం పోసింది. అలాంటి గొప్ప పథకానికి ఆయన తనయుడు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరింత ఊపిరి పోస్తున్నారు. రోగాల సంఖ్యను పెంచడంతోపాటు వైద్య ఖర్చుల పరిమితిని రూ.25 లక్షలకు పెంచడం మంచి నిర్ణయం.

–రాజరత్నంరెడ్డి,
ప్రజాహిత సేవా సంస్థ అధ్యక్షుడు, చిత్తూరు

ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం



ఇప్పటికే ఆరోగ్యశ్రీపై సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. ఆరోగ్య శ్రీకార్డుల ముద్రణ ప్రారంభమైంది. త్వరలో కార్డులన్నీ జిల్లాలకు చేరుతాయి. సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం తర్వాత కొత్త కార్డులు పంపిణీ చేస్తాం. నియోజకవర్గాల వారీగా ఐదు సచివాలయాల పరిధిలో ప్రజాప్రతినిధుల చేత కార్యక్రమాలు నిర్వహించి కార్డులు ఇస్తాం. వైద్య, సచివాలయ సిబ్బంది ద్వారా ఆరోగ్య శ్రీ సేవలపై అవగాహన కార్యక్రమాలుంటాయి.

–రాజశేఖర్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్, తిరుపతి

రైతులకు నష్టం జరగనివ్వం

- ఇంట్లో అర్హులందరికీ ఉద్యోగం
- భూ సేకరణలో ప్రతి ఇంటికీ పరిహారం
- రాష్ట్ర అటవీ, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: మండలంలో జర్మన్ పెప్పర్ మోషన్ ఎలక్ట్రికల్ బస్సుల కంపెనీ ఏర్పాటు కోసం భూములిచ్చిన రైతులకు ఎట్టి పరిస్థితుల్లో నష్టం జరగనివ్వం అని రాష్ట్ర అటవీ, విద్యుత్ శాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. మండలంలో రూ.10 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ కార్యాలయ భవనాలను మంత్రి ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ భూములిచ్చిన రైతుల ఇంట్లో అర్హులైన వారు ఎంత మంది ఉంటే అందరికీ ఉద్యోగం, పరిహారం, సంతృప్తిగా అందిస్తామని, ఇందులో ఎలాంటి అనుమానాలకు, అపోహలకు తావులేదని స్పష్టం చేశారు. జర్మన్ బస్సుల కంపెనీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనుమతి ఇవ్వడం ఎంతో అదృష్టమని పేర్కొన్నారు. ఈ నియోజకవర్గం వెనుకబడిన ప్రాంతం కావడంతో ముఖ్యమంత్రి బస్సుల పరిశ్రమను పుంగనూరుకు కేటాయించారని తెలిపారు. అనంతపురంలో కార్ల పరిశ్రమతో ఆ ప్రాంతం అన్ని విధాలా అభివృద్ధి చెందిందన్నారు. అదే విధంగా మన ప్రాంతంలో



ఉలవలదిన్నెలో ఆర్వో ప్లాంటును ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పరిశ్రమల ఏర్పాటుతో ఎంతో అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. జర్మన్ కంపెనీ వారు త్వరలోనే భూసేకరణకు సంబంధించి నిధులు కలెక్టర్ వద్ద డిపాజిట్ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం వేగవంతంగా సాగుతోందన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో పుంగనూరు నియోజకవర్గంలో భూముల ధరలు పెరుగుతుందన్నారు. నిరుద్యోగులకు ఉపాధితోపాటు వ్యాపారులకు అన్ని రకాలుగా బస్సుల కంపెనీ ఉపయోగపడుతాయన్నారు. ఇలాంటి పరిశ్రమల ఏర్పాటు సమయంలో ప్రజలందరూ సహకరించి, అభివృద్ధికి అండగా నిలవాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఈ కృష్ణారెడ్డి, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అందరికీ మేలు

శాంతిపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలందరికీ మేలు జరిగితే చంద్రబాబు పాలనలో టీడీపీ నాయకులు, వారి బంధువులకు మాత్రమే మేలు జరిగిందని ఎమ్మెల్సీ భరత్ చెప్పారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సి.బండపల్లిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్థానిక ప్రజలతో సమావేశమై వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో ప్రతి పంచాయతీలో ఒకటి లేదా రెండు కుటుంబాలు మాత్రమే బాగుపడ్డాయని చెప్పారు. గత ఐదేళ్లుగా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి గ్రామ సచివాలయాలు, వలంటీర్ల ద్వారా నేరుగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. వైద్యం ఖర్చులు ఎవరికీ భారం కాకుండా ఆరోగ్యశ్రీ ద్వారా ఇకపై రూ.25 లక్షల వరకూ ఖరీదైన వైద్యం ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలని పథకాల ద్వారా ఆర్థిక తోడ్పాటును అందిస్తున్నారన్నారు. ప్రజలందరినీ తన కుటుంబ సభ్యులుగా చూస్తున్న సీఎంను ఆశీర్వదించాలని కోరారు.

మాయగాళ్లతో భద్రం

ఎన్నికల సమయంలో అబద్ధాలను చెప్పడం, గెలిచాక జనాన్ని గాలికి వదిలేయటంలో ఆరితేరిన మాయగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్సీ భరత్ చెప్పారు. 2014 ఎన్నికలకు ముందు రుణాలను పూర్తిగా మాఫీ చేస్తామని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి రాగానే ఏమి చేశారో రైతులు, డ్వాక్రా మహిళలకు బాగా తెలుసన్నారు. రానున్న ఎన్నికల కోసం మళ్లీ కొత్త హామీలతో వచ్చినా నమ్మడానికి జనం సిద్ధంగా లేరని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ పట్టాభి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, స్థానిక నాయకులు కుమర్‌రాజా, చంద్ర, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సి.బండపల్లిలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ భరత్

డైట్‌లో పూర్వ విద్యార్థుల సందడి



కార్వేటినగరం డైట్ కళాశాలలో1984-85 బ్యాచ్‌కు చెందిన ఛాత్రోపాధ్యాయులు

కార్వేటినగరం: వారంతా జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో 1984–85లో టీటీసీ శిక్షణ పొంది ప్రస్తుతం వేర్వేరు చోట్ల స్థిరపడ్డారు. అయితే 38 ఏళ్ల తరువాత ఒక ఫోన్‌కాల్ వారిని ఒక చోటకు చేరేలా చేసింది. ఆదివారం వారంతా ఒకేచోట కలుసుకుని చిన్ననాటి తీపి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డైట్ ప్రిన్సిపల్ (తిరుపతి జిల్లా డీఈఓ) శేఖర్ మాట్లాడుతూ టీటీసీ ప్రారంభం నుంచి నేటి వరకు జిల్లా విద్యాశిక్షణా సంస్థలో ఛాత్రోపాధ్యాయులుగా శిక్షణ పొందిన ప్రతి ఒక్కరూ గురువులుగా సేవలు అందించడాన్ని గుర్తు చేస్తుందన్నారు. ఉపాధ్యాయులుగా కొలువుదీరిన మనమంతా మరెంతో మంది విద్యార్థులను తీర్చిదిద్ది సమాజంలో గురువుల గొప్పతనాన్ని చాటాలని సూచించారు. అనంతరం సర్వేపల్లె రాధాకృష్ణ చిత్రపటంతోపాటు డైట్ ప్రిన్సిపల్స్‌గా విధులు నిర్వహించి మృతి చెందిన పుల్లారెడ్డి, బ్రహ్మయ్య చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. గురువులైన డాక్టర్ యోగానందం, సుగుణకుమారి, ప్రభాకర్‌రెడ్డికి శాలువలు కప్పి గజమాలలతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చిత్తూరు డీవైఈఓ చంద్రశేఖర్, నిర్వాహకులు డాక్టర్ విజయులురెడ్డి (డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్) హమీద్‌బాషా, వేణుగోపాల్, పొన్నురంగం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మడమ తిప్పని ఘనత జగనన్నదే!

- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: మాట ఇస్తే మడమతిప్పని నాయకుడెవరైనా ఉన్నారంటే అది మన సీఎం జగనన్నే అని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. వీరు మండలంలోని కృష్ణాపురంలో నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన సచివాలయ భవనం, డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, గోనుమాలపల్లి, కుంభార్లపల్లి, ఓగు, బీసీ పల్లిలో రైతు భరోసా కేంద్రాలను ఆదివారం ప్రారంభోత్సవం చేశారు. దీంతోపాటు ఎస్ బండపల్లి సచివాలయ పరిధిలోని బెల్లకుంట, ఆరిమాకులపల్లి, నెర్నిపల్లి సచివాలయ పరిధిలోని రామాపురం, పైపల్లి, బోడిగుట్లపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని బోడిగుట్లపల్లి గ్రామాల్లో సీఎండీఎఫ్, జీజీఎంపీ, నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. పాముగానిపల్లి సచివాలయంలోని నూతన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్ భవనాలను అట్టహాసంగా పండగ వాతావరణంలో ప్రారంభించారు. వారు ప్రసంగిస్తూ ఒక్కొక్క సచివాలయానికి రూ.40 లక్షలు, ఒక్కో రైతు భరోసా కేంద్రానికి రూ.21.8 లక్షలు, ఒక్కో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌కు రూ.20.80 లక్షలు సీఎండీఎఫ్, జీజీఎంపీ నిధులతో రామాపురంలో రూ.30 లక్షలతో సీసీ రోడ్లు, ఆరిమాకులపల్లి, బెల్లకుంట గ్రామాల్లో రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, పైపల్లి గ్రామంలో రూ.2.20 లక్షలతో సీసీ రోడ్లను నిర్మించినట్లు వివరించారు. గతంలో టీడీపీ పాలనకు ప్రస్తుతం జగనన్న అందిస్తున్న పాలనకు తేడాను గమనించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజ్, వైస్ ఎంపీపీలు తమీమ్, లక్ష్మణ్ రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు పిఎస్ నాగరాజు, ఎస్ఏ గౌస్, మండల కన్వీనర్ బాలగురునాథ్, మండల సచివాలయాల కన్వీనర్ కిషోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ భవన ప్రారంభోత్సవంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ

విద్యార్థుల ఉన్నతికి సాక్షి మ్యాథ్స్‌బీ..స్పెల్‌బీ

తిరుపతి ఎడ్యుకేషన్ : సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతి వేదికగా మ్యాథ్స్‌బీ సెమీ ఫైనల్స్, స్పెల్‌బీ క్వార్టర్ ఫైనల్స్ పరీక్షలు నిర్వహించారు. తిరుచానూరు రోడ్డు, శ్రీనివాసపురంలోని హోలీ గ్రీన్ పాఠశాలలో చేపట్టిన పరీక్షలకు తిరుపతి, చిత్తూరు తదితర ప్రాంతాల్లోని పలు విద్యాసంస్థల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఆయా పాఠశాలల యాజమాన్యాలతో కలిసి హాజరయ్యారు.



మ్యాథ్స్ బీ, స్పెల్ బీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

పోటీ ప్రపంచంలో రాణించేలా..

ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించేందుకు గణితం, ఆంగ్లంపై పట్టు తప్పనిసరి. గణితంలో ఫార్ములాలు, ఆంగ్ల భాషపై పట్టు, ఈ రెండింటిలో నైపుణ్యం ఉంటే ఉన్నతంగా రాణించగలుగుతాం. వీటి ప్రాధాన్యతను గుర్తించిన సాక్షి మీడియా గ్రూప్ గణితం, ఆంగ్ల భాషపై విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తూ వారిని ఆ రెండు సబ్జెక్టుల్లో నైపుణ్యం సాధించేలా ప్రోత్సహించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఏటా మ్యాథ్స్‌బీ, స్పెల్‌బీ పరీక్షలు నిర్వహిస్తోంది. పాఠశాల స్థాయి, క్వార్టర్, సెమీస్, ఫైనల్స్ విభాగాల్లో ఈ పరీక్షలను నిర్వహించి విద్యార్థులను నగదు, ఇతర బహుమతులతో సత్కరిస్తోంది. ఈ ఏడాది ఈ రెండు పరీక్షలకు ప్రధాన స్పాన్సర్‌గా డ్యూక్స్ వేఫి, అసోసియేషన్ స్పాన్సర్‌గా రాజమండ్రికి చెందిన ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవహరిస్తున్నాయి.

మ్యాథ్స్‌బీ సెమీస్...

మ్యాథ్స్‌బీ సెమీ ఫైనల్స్ పోటీలకు విశేష స్పందన లభించింది. ఉదయం 9నుంచి 10గంటల వరకు అన్ని కేటగిరీలకు నిర్వహించిన ఈ పరీక్షకు అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరై తమ మేధస్సుకు పదును పెట్టారు.

స్పెల్‌బీ క్వార్టర్ ఫైనల్స్..

పాఠశాల స్థాయి స్పెల్‌బీలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు క్వార్టర్ ఫైనల్స్ నిర్వహించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటలకు నాలుగు కేటగిరీల్లో జరిగిన పరీక్షకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు తరలివచ్చారు. స్పెల్‌బీ పరీక్ష రాయడానికి విద్యార్థులు ఆసక్తి కనబరిచారు. ఇంగ్లిష్ భాషపై తమకున్న పట్టు, ప్రతిభను పరీక్షించుకున్నారు. స్పెల్‌బీ ద్వారా తమలో నైపుణ్యం, సామర్థ్యం పెరిగిందని, భాషపై పట్టు సాధించుకుంటున్నామని, కొత్త పదాలు, స్పెల్లింగులు, పదాల ఉచ్ఛారణ వంటి సరికొత్త విషయాలు తెలుసుకుంటున్నామని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

నాలుగు కేటగిరీల్లో..

సాక్షి స్పెల్‌బీ క్వార్టర్ ఫైనల్స్‌లో ఒకటవ కేటగిరీ కింద 1, 2వ తరగతులకు, రెండో కేటగిరీ కింద 3,4వ తరగతులకు, మూడో కేటగిరీ కింద 5, 6, 7వ తరగతులకు, నాలుగో కేటగిరీ కింద 8నుంచి పదో తరగతి వరకు లైవ్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులు సెమీఫైనల్ పరీక్షకు అర్హత సాధించనున్నారు. కార్యక్రమంలో సాక్షి ఈవెంట్స్ ఇన్‌చార్జి టి.చంద్రశేఖర్, ఏడీవీటీ సిబ్బంది భాస్కర్, సుబ్బారావు, అయోధ్యాపురం ధర్మారెడ్డి, పాఠశాల అడకమిక్ డైరెక్టర్ ఓ.మురళి పాల్గొన్నారు.

పోటీ ప్రపంచానికి సరైన వేదిక



ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించేందుకు సబ్జెక్టు పరంగానే కాకుండా అన్ని అంశాల్లో నైపుణ్యం కలిగి ఉండాలి. కొంతమంది విద్యార్థులకు గణితం, ఇంగ్లిష్ అంటే కొంత భయం ఉంటుంది. సరైన విధానంలో వారికి బోధించలేనప్పుడు ఈ భయం మరింత పెరుగుతుంది. ఈ భయాన్ని పోగొట్టేందుకు, వారిలో ఆసక్తి పెంపొందించి చదువులో బాగా రాణించేందుకు సాక్షి నిర్వహిస్తున్న మ్యాథ్స్‌బీ, స్పెల్‌బీ ఎంతో దోహదపడుతుంది.

- సి.వేణుగోపాల్‌రెడ్డి, చైర్మన్, హోలీగ్రీన్ స్కూల్

తల్లిదండ్రులు ప్రోత్సహించాలి



నేటి సమాజంలో విద్యార్థులు ఉన్నతంగా రాణించగలిగితేనే జీవితంలో ఉన్నత స్థాయికి చేరగలరు. దీనికోసం పాఠ్యాంశాల్లో ముఖ్యమైన మ్యాథ్స్, ఇంగ్లిష్‌లో పట్టు సాధించగలగాలి. దీన్ని దృష్టిలో ఉంచుకునే సాక్షి మీడియా గ్రూప్ ఏటా మ్యాథ్స్ బీ, స్పెల్ బీ నిర్వహిస్తూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను పెంపొందించేందుకు కృషి చేస్తోంది. ఇలాంటి పరీక్షలపై తల్లిదండ్రులు అవగాహన పెంపొందించుకుని తమ పిల్లలను ప్రోత్సహించాలి.

- బి.హరినాథరెడ్డి, డైరెక్టర్, హోలీగ్రీన్ స్కూల్

కొత్త పదాలు తెలిశాయి



స్పెల్‌బీ పరీక్షలో పాల్గొనడం ద్వారా ఇంగ్లిష్ భాషలోని కొత్త పదాలను తెలిశాయి. ఆ పదాల స్పెల్లింగ్ నేర్చుకున్నా. వాటిని ఎలా ఉచ్ఛరించాలనే విషయాలను మా టీచర్లు నేర్పించారు. స్పెల్‌బీ క్వార్టర్ ఫైనల్ పరీక్ష బాగా రాశా. ఫైనల్‌కు చేరుకోవడమే నా లక్ష్యం.

- ఎస్.లాస్యా రెడ్డి, 4వతరగతి, ప్రశాంత్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, తిరుపతి

ఆసక్తి పెరిగింది



స్పెల్‌బీ పరీక్షలో తొలిసారిగా పాల్గొన్నా. పాఠశాల స్థాయిలో ప్రతిభ కనబరచి క్వార్టర్ ఫైనల్‌కు చేరడం సంతోషంగా ఉంది. ఇంగ్లీష్ భాషపై పట్టు సాధించడంతో పాటు మరింతగా నైపుణ్యం సాధించాలన్న ఆసక్తి పెరిగింది. థ్యాంక్స్ టు సాక్షి.

- ఎ.అర్షిత, 4వ తరగతి, క్యాంఫోర్డ్ స్కూల్, చిత్తూరు

బాగా ఉపయోగపడింది



స్పెల్‌బీ పరీక్షలో మొదటిసారి పాల్గొన్నా. క్వార్టర్ ఫైనల్‌కు చేరడం ఆనందంగా ఉంది. పాఠ్యాంశాల్లోని ఇంగ్లిష్ పదాలతో పాటు స్పెల్లింగ్స్, ఉచ్ఛారణ తెలిసింది. మరింతగా నైపుణ్యం సాధించేందుకు స్పెల్‌బీ నాకు బాగా ఉపయోగపడింది.

- వి.రోహన్, 5వ తరగతి, విశ్వం విద్యాసంస్థ, తిరుపతి

ఫైనల్స్‌కు వెళ్లడమే లక్ష్యం



స్పెల్‌బీ పరీక్షలకు రెండో పర్యాయం హాజరయ్యా. గత ఏడాది సెమీ ఫైన ల్ వరకు వెళ్లా. ఈ ఏడాది ఎలాగైనా సెమీస్‌లో అర్హత సాధించి ఫైనల్‌కు వెళ్లడమే లక్ష్యం. దీనికోసం స్పెల్‌బీ మెటీరియల్‌ను సాధన చేశా. కొత్త పదాలకు స్పెల్లింగ్‌లు, ఉచ్ఛారణ తెలుసుకున్నా. స్పెల్‌బీ వల్ల ఇంగ్లిష్ భాషపై పట్టు సాధిస్తున్నా.

- పి.ధనశ్రీ, 7వ తరగతి, జేసీఆర్ చైతన్య స్కూల్, తిరుపతి

సాధన చేశా



సాక్షి నిర్వహిస్తున్న స్పెల్‌బీ పరీక్షకు బాగా సాధన చేశా. స్పెల్‌బీ మెటీరియల్‌లో చాలా కొత్త పదాలున్నాయి. ఆ పదాలకు స్పెల్లింగ్స్ నేర్చుకున్నా. కొత్త పదాలను ఎలా ఉచ్ఛరించాలి, ఆ పదాలకు అర్థాలను మా ఇంగ్లిష్ టీచర్ నేర్పించారు.

- దియా విశ్వనాథన్, 7వ తరగతి, ఎడిఫై పాఠశాల,తిరుచానూరు

దుమ్మురేపిన ఎడ్ల పందేలు

శ్రీరంగరాజపురం: యువత కేరింతలు... జనం చప్పట్లు... కోడె గిత్తల జోరుతో మండలంలోని ఉడలమకుర్తి పంచాయతీ ఎస్ఎండీ పురంలో ఆదివారం నిర్వహించిన ఎడ్ల పందేలు దుమ్మురేపాయి. సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని ఎడ్ల పందేలు నిర్వహించడం ఆనవాయితీ. ముందుగా ఎడ్లకు పలకలు, బెలూన్‌లు కట్టి పందేనికి ఉసిగొల్పారు. అంతకు ముందే వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్న యువత అల్లి వద్ద పలకల కోసం నిలబడ్డారు. ఈలలు వేస్తూ తరిమిన కోడెగిత్తలు రంకెలేసుకుంటూ జనాలపై దూసుకుపోయాయి. ఎడ్లను నిలువరించి పలకలు పట్టేందుకు యువత పోటీ పడ్డారు. పలకలు పట్టిన యువత విజయ దరహాసంతో చిందులు వేశారు. అయితే కొన్ని ఎడ్లు జన ప్రవాహాన్ని సైతం లెక్కచేయకుండా దూసుకెళ్లాయి. కొందరు ఎడ్ల కింద పడి గాయపడ్డారు. ఎడ్ల పందేలు కోలాహలంగా సాగాయి.



దూసుకుపోతున్న కోడె గిత్తలు

ట్రాక్టర్ బోల్తా పడి రైతు దుర్మరణం



మృతి చెందిన గోపి నాయుడు

గంగాధర నెల్లూరు: మండలంలోని పాత వెంకటాపురం పంచాయతీ అగ్రహారానికి చెందిన రైతు మృతి చెందిన సంఘటన ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు గంగాధర నెల్లూరు మండలం పాతవెంకటాపురానికి చెందిన గోపి నాయుడు (42) ఆదివారం ఉదయం వరి పైరు నాటడానికి తన పొలాన్ని దున్నుతున్న సమయంలో రోటోవేటర్ తిరగబడడంతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

భక్తులతో కిక్కిరిసిన బోయకొండ

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనం కోసం ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో అత్యంత సుందరంగా ముస్తాబు చేశారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, జంతు బలులిచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయంలో ఒక్కసారిగా భక్తుల రద్దీ పెరగడంతో క్యూలన్నీ నిండి కిటకిటలాడాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఆలయ ఈఓ చంద్రమౌళి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు ఉచిత తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు.



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

ఇది కదా అభివృద్ధి!

గత పాలకులు సర్కారు బడులను పట్టించుకున్న పాపాన పోలేదు. విద్యార్థులకు ఓటు లేదన్న భావనతో పాఠశాలల అభివృద్ధిని కొన్ని సంవత్సరాలపాటు విస్మరించారు. ఈ పరిస్థితిని రూపుమాపేందుకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు పథకానికి శ్రీకారం చుట్టారు. బడుల్లో వసతుల కల్పనకు వేల కోట్లను ఖర్చు చేశారు. గ్రామాల్లోని సర్కారు బడులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. ఈ పథకంపై ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఏమంటున్నారంటే..

జనవాక్కు

- చిత్తూరు కలెక్టరేట్



నాడు నేడు పథకంలో తీర్చిదిద్దిన కార్వేటినగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల

ఇది మా అందమైన పాఠశాల



గతంలో గదులు ఉరుస్తూ, పెచ్చులూడి పడుతూ పిల్లలతో పాటు నేను భయ భ్రాంతులకు గురయ్యేవాడిని. కనీస వసతులు లేకుండా విద్యార్థులు ఇబ్బందులు పడేవాళ్లు. ఇప్పుడు నాడు–నేడు పథకంతో రాష్ట్ర ప్రభుత్వం లక్షలు వెచ్చించి అందమైన భవనాలుగా తీర్చిదిద్దింది. విద్యార్థులు కూర్చోవడానికి సౌకర్యవంతంగా డెస్కులు ఏర్పాటు చేసింది. ఆంగ్ల మాధ్యమాన్ని సులభ పద్ధతుల్లో బోధించే విధంగా డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేసింది. మా పాఠశాలలో గతంలో ఇద్దరు విద్యార్థులు ఉండేవారు. ప్రస్తుతం 42 మంది ఉన్నారు. ఇదంతా ఈ ప్రభుత్వం ఘనతే.

- గోపీనాథ్, టీచర్, ఈదువారిపల్లి పాఠశాల, కార్వేటినగరం

గతంలో సౌకర్యాలు ఉండేవి కావు



గతంలో మా పాప చదివే పుత్తూరు జెడ్పీ హైస్కూల్లో ఎలాంటి సౌకర్యాలు ఉండేవి కావు. దీంతో ప్రైవేటు పాఠశాలలో చేర్పించేందుకు ప్రయత్నాలు చేశాం. అయితే ప్రస్తుత ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేసింది. బడుల్లో అన్నిరకాల వసతులు కల్పించింది. నాడు –నేడు పథకంతో ప్రభుత్వ బడులన్నీ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా రూపుదిద్దుకున్నాయి. లక్షలాది రూపాయలు ఫీజులు చెల్లించే కార్పొరేట్ బడుల్లో కూడా ఇలాంటి సౌకర్యాలు లేవు. ఇలాంటి చదువు కూడా అక్కడ చెప్పడం లేదు. ప్రభుత్వ పథకాలు సకాలంలోనే అందుతున్నాయి. మా పాప యువశ్రీ తొమ్మిదో తరగతి ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుంటోంది. పేదలు చదివే పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్న జగనన్నకు రుణపడి ఉంటాం.

- వెంకటరత్నమ్మ, విద్యార్థిని తల్లి, పుత్తూరు మండలం

గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి



గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో చూస్తున్నాం. ఈ అభివృద్ధి సీఎం వైఎస్ జగన్ చొరవ వల్లే సాధ్యమయ్యింది. నాడు–నేడు పథకం ప్రవేశపెట్టి లక్షల నిధులు ఖర్చు చేసి, సర్కారు బడుల రూపురేఖలు మార్చేశారు. ఇది అంత సామాన్యమైన పని కాదు. విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతనిస్తోంది. మా పాఠశాలలను నాడు–నేడు పథకంలో కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దాం. చుట్టు పక్కల ఏ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో ఇలాంటి సౌకర్యాలు లేవు. ఈ కారణం వల్లే విద్యార్థుల అడ్మిషన్‌లు గతంలో కంటే ఎక్కువగా నమోదవుతున్నాయి.

- ఇలియాజ్, హెచ్ఎం, ఎంపీపీఎస్ ఉర్దూ, వీ.కోట

ఇలాంటి సౌకర్యాలు అప్పుడు లేవు



నేను చదువుకునే రోజుల్లో ప్రభుత్వ బడులు ఇలాగా లేవు. అంతెందుకు ఐదేళ్ల క్రితం ఈ పాఠశాలలో ఇలాంటి సౌకర్యాలు లేవు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాతనే ఈ బడులకు మోక్షం వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాడు – నేడు పథకం మా పిల్లల జీవితాలను మారుస్తోంది. కీలపట్ల జెడ్పీ హైస్కూల్లో నాడు నేడు పథకంలో అన్ని సౌకర్యాలు కల్పించారు. లక్షలాది రూపాయలను ఖర్చు చేశారు. మా పిల్లలు ఇక్కడే చదువుతున్నారు. మాలాంటి పేదల పిల్లలను ఉన్నత స్థాయికి తీసుకురావాలన్న ఉద్దేశంతో సీఎం అమలు చేస్తున్న ఈ పథకాలు ఎంతో మేలు చేకూరుస్తున్నాయి. సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం.

- చంద్రబాబు, విద్యార్థి తండ్రి, కీలపట్ల, గంగవరం